క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు



గడివేములలో పూజలు చేస్తున్న శివస్వాములు

గడివేముల: మండల కేంద్రంలోని శివాలయంలో కొలువై ఉన్న రామలింగేశ్వర స్వామికి అర్చకులు బ్రహ్మయ్య శర్మ ఆధ్వర్యంలో సోమవారం శివస్వాములు విశేష పూజలు నిర్వహించారు. మండల మాలాధారణ స్వీకరించిన తరువాత మొదటి సోమవారం కావడంతో శివాలయంలోని రామలింగేశ్వర స్వామికి వేకువజామునే గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, శివార్చన, శివ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ బిల్వార్చన, విశేష పుష్పాలతో అలంకరణ చేసి బిల్వాష్టకం, లింగాష్టకం, శివ పంచాక్షరి స్తోత్రం, శివ నామ స్తోత్రం పఠించారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

పాణ్యం: మండలంలో నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ 21న అలమూరు, 22న తొగర్చేడు, 23న గోరుకల్లు, 24న గోనవరం, 27న పాణ్యం, 28న పాణ్యం, 29న కొండజుటూరు, 30న అలమూరులో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక శిబిరాల్లో ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్తగా నమోదు తదితర సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు విద్యుత్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరాలో తాత్కాలిక మార్పులు చేసినట్లు ఏఈ సునీల్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు శివారులోని కార్బైడ్ ఫ్యాక్టరీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నన్నూరు సబ్‌స్టేషన్‌కు సరఫరా జరిగే 33 కేవీ విద్యుత్ లైన్, నన్నూరు ఫీడర్‌లో మరమ్మతు పనులు జరుగుతున్న సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల వ్యవసాయ విద్యుత్ బోర్లకు తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ సునీల్ బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జయప్రదం చేయండి

పాణ్యం: ఈనెల 22, 23 తేదీల్లో నంద్యాల మున్సిపల్ హాల్‌లో జరిగే నంది బాలోత్సవాల కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నెరవాటి రాజు పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా పిల్లల్లోని శక్తి సామర్థ్యాలు, సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు.

ఆరోగ్య పింఛన్ల పరిశీలన

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో హెల్త్ పింఛన్లు (ఆరోగ్యం క్షీణించిన) అందుకుంటున్న లబ్ధిదారులను ప్రభుత్వం నియమించిన డాక్టర్లచే రీ వెరిఫికేషన్ చేస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్తా తెలిపారు. మండలంలో 51 హెల్త్ పింఛన్లు ఉన్నాయని వారు ప్రతి నెలా రూ.15 వేలు పింఛన్ సొమ్ము అందుకుంటున్నట్లు వివరించారు. వీరందరినీ తనిఖీ చేసేందుకు అనంతపూర్ జిల్లాకు చెందిన డాక్టర్లు మోహన్‌నాయక్, రాజశేఖర్ స్వరూప్‌లను ప్రభుత్వం నియమించింది. సోమవారం మండల పరిధిలోని గనిలో 11 పింఛన్లను, దుర్వేశిలో రెండు, చిందుకూరులో రెండు, గడిగరేవులలో 8, ఓండుట్ల, కొరటమద్ది గ్రామాల్లో ఒక్కొక్క పింఛన్‌ను వెరిఫికేషన్ చేశారన్నారు. గతంలో ఇచ్చిన మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించడంతో పాటు లబ్ధిదారుడి పరిస్థితిని అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ విషయాలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గోరంట్ల జట్టు



విజేత గోరంట్ల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

వెల్దుర్తి: స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి సూపర్-8 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కోడుమూరు మండలం గోరంట్ల జట్టు నిలిచింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వెల్దుర్తి హైస్కూల్ 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, సురేశ్-11 టీమ్ సంయుక్తంగా నిర్వహించిన టోర్నీలో 32 జట్లు పాల్గొన్నాయి. సోమవారం ఫైనల్ పోటీలో గోరంట్ల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని ప్రత్యర్థి వెల్దుర్తి గట్టి ఎలెవెన్ జట్టుకు 60 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రత్యర్థి జట్టు 40 పరుగులకు ఆలౌట్ కావడంతో గోరంట్ల విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు రూ.20వేల నగదు, ట్రోఫీ, రన్నర్స్‌కు రూ.10వేల నగదు, ట్రోఫీని నిర్వాహకులు అందించారు. బెస్ట్ పెర్ఫార్మెన్స్‌గా వెల్దుర్తి గట్టి ఎలెవెన్ జట్టు సభ్యుడు అనూప్ ప్రత్యేక ట్రోఫీ అందుకున్నాడు. నిర్వాహకులు సురేశ్, శ్రీను, సుమన్, రాహుల్, సూరి పాల్గొన్నారు.

రహదారిపై రక్తపుటేరులు

కోడుమూరు ప్రజలకే కాదు.. జిల్లా వాసులకు ఆ రోడ్డంటే టెర్రర్ పట్టుకుంది. కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులో ప్రయాణించాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని ప్రజలు వాహనాలు ఎక్కుతున్నారు. కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే దారిలో ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాల సమీపాల్లో వరుస రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా ప్రమాదాల్లో ఎంతో మంది తమ విలువైన ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయాలపాలై కాళ్లు, చేతులు విరిగి నేటికీ ఆస్పత్రులలో చికిత్సలు పొందుతున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటి వరకు కోడుమూరు నుంచి కర్నూలు రోడ్డులో 6 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, కోడుమూరుకు చెందిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందడం గమనార్హం. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.



ఈనెల 17న జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు (ఫైల్)

- కోడుమూరు – కర్నూలు రోడ్డులో వరుస ప్రమాదాలు
- 9 నెలల్లో 12 మంది మృత్యువాత, పలువురికి గాయాలు
- రోడ్డెక్కాలంటే భయపడుతున్న ప్రజలు
- రహదారి వెడల్పుపై దృష్టి పెట్టని ప్రభుత్వం





గతేడాది మే 23న బోల్తా పడిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు,క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాలు (ఫైల్)

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలు మార్గంలో వాహనాల రద్దీ భారీగా పెరిగింది. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ, గుంతకల్, బళ్లారి వంటి ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలన్నీ కోడుమూరు పైనే సాగిస్తుంటారు. దీంతో కోడుమూరు నుంచి కర్నూలు వెళ్లే రోడ్డులో నిత్యం వాహనాల రద్దీతో ఉంటుంది. ముఖ్యంగా ఆలూరు, ఆదోని, పత్తికొండ ప్రాంతాల నుంచి కర్నూలు, హైదరాబాద్, విజయవాడ వంటి పట్టణాలకు కూరగాయలు తరలించే లారీలు, ఇతర వాహనాలు భారీ వేగంతో వెళుతుంటాయి. దీంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఈ రోడ్డుపై విపరీతమైన వాహనాల రద్దీ ఉంటుంది. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడం, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఒక వాహనాన్ని మరో వాహనం ఓవర్‌టేక్ చేసే సమయంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ రోడ్డుపై వాహనాలకు వేగ పరిమితి లేకపోవడంతో వాహనాలన్నీ అతివేగంతో దూసుకెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నాయి.

గతేడాది మే నుంచి ఈ ఏడాది జనవరి వరకు చోటు చేసుకున్న ప్రమాదాలు - మృతుల వివరాలు

- గతేడాది మే 23వ తేదీన ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా పడడంతో మైదుకూరుకు చెందిన బాలికలు ధనలక్ష్మి (13), గోవర్ధనీ (9) బస్సు కింద పడి గాఢనిద్రలోనే కన్నుమూశారు.
- గతేడాది జూలై 2వ తేదీ కృష్ణగిరి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన తిమ్మరాజు (20) అనే యువకుడు బైక్‌పై వస్తూ ఆర్‌టీసీ బస్సు కిందపడి మృతి చెందాడు.
- గతేడాది ఆగస్టు 28వతేదీ కోడుమూరుకు చెందిన జగదీష్ (31) బైక్‌పై కర్నూలు నుంచి వస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- గతేడాది అక్టోబరు 24న పందుల లోడ్‌తో వెళుతున్న బొలేరో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో వైఎస్సార్ జిల్లా చెన్నూరుకు చెందిన రామయ్య (43), నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన గుర్రప్ప (32) అక్కడికక్కడే మృతిచెందారు.
- ఈ ఏడాది జనవరి 2న కోడుమూరుకు చెందిన రామగోవిందు (56), భార్య వరలక్ష్మి (50)తో కలిసి మోటార్ సైకిల్‌పై కర్నూలు వెళ్లి వస్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు.
- జనవరి 6న కారు బోల్తా పడడతో కోడుమూరుకు చెందిన సప్పాగు విజయ్ (55) అక్కడికక్కడే మృతి చెందాడు.
- జనవరి 17న లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో కోడుమూరుకు చెందిన సోమశేఖర్ (56), బండ శ్రీనివాసులు (46), రాజోలి శ్రీను (36) మృతి చెందారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన కోడుమూరు -కర్నూలు రోడ్డు

రోడ్డు వెడల్పుపై చిత్తశుద్ధి ఏదీ

వాహనాల రద్దీకి తగ్గట్లుగా రోడ్డు వెడల్పుపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో కర్నూలు-కోడుమూరు రోడ్డు ప్రమాదాలకు దారేసినట్లుగా మారింది. కర్నూలు నుంచి బళ్లారికి నాలుగు లైన్ల రోడ్డు నిర్మించాలని ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం స్పందించి కనీసం కర్నూలు నుంచి కోడుమూరు వరకైనా నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు, రోడ్డు మధ్యలో డివైడర్లు, రోడ్డుపై వాహనాలకు వేగపరిమితి ఉండేలా చూడాలని ఈ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నిబంధనలు పాటించేలా చూడాలి



కోడుమూరు – కర్నూలు రోడ్డును వాహనాల రద్దీకి తగ్గట్లుగా వెడల్పు చేసి మధ్యలో డివైడర్ల ఏర్పాటు, వేగపరిమితిని నిర్ధారించే కెమెరాలను ఏర్పాటు చేయాలి. పల్లెల నుంచి మెయిన్ రోడ్డుకు ఎక్కే చోట స్పీడ్ బ్రేకర్లు వేయాలి. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ఎద్దుల సూర్యారెడ్డి, సివిల్ ఇంజినీర్, కోడుమూరు

రోడ్డు విస్తరణ చేపట్టాలి



కోడుమూరు- కర్నూలు రోడ్డులో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. దీంతో పాటు రోడ్డు వెడల్పుగా లేకపోవడం, వాహనాల రద్దీ, మితిమీరిన వేగం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి కర్నూలు నుంచి బళ్లారి వరకు ఉన్న ప్రస్తుత రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా ఏర్పాటు చేయాలి. రోడ్డు నిర్మాణం కోసం ప్రజలతో కలిసి ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కోడుమూరు

పశు సంపద పరిరక్షణకు చర్యలు



సి.బెళగల్‌లో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పాండురంగన్న

సి.బెళగల్: పాడి రైతులు పశు సంపద పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న సూచించారు. సోమవారం స్థానిక పశు వైద్యశాలలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ రిబ్బన్ కట్ చేసి ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి రైతులను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ.. పశుపోషణపై రైతులు శ్రద్ధ వహించాలన్నారు. డాక్టర్ మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పశు వైద్య శిబిరాలను నిర్వహించి, పశువులకు ఉచిత వైద్య సేవలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా 21న కంబదహాల్, 22న కంబదహాల్, 23న పలుకుదొడ్డి, 24న సంగాల, 25న తిమ్మందొడ్డి, 27న బురాన్‌దొడ్డి, 28న గొల్లలదొడ్డి గ్రామాల్లో ప్రత్యేక పశు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రవీన్‌కుమార్ తెలిపారు. పశు సహాకులు జాహ్నవి, మహేంద్ర, రైతులు ఉన్నారు. అలాగే ముడుమాల గ్రామంలో పోలకల్ పశువైద్యుడు డాక్టర్ రోనాల్డ్ రీచర్డ్స్ ప్రత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. పాడి రైతులు, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరినీ అక్షరాస్యురాలుగా తీర్చిదిద్దాలి



కోడుమూరులో వలంటరీ టీచర్లకు మెటీరియల్ అందజేస్తున్న ఎంపీడీఓ, ఏపీఎం



సి.బెళగల్‌లో వలంటీర్ టీచర్లకు సూచనలు చేస్తున్న ఏపీఎం రామేశ్వర్

కోడుమూరు రూరల్: ప్రతి మహిళను అక్షరాస్యురాలిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వలంటరీ టీచర్లదేనని ఎంపీడీఓ రాముడు సూచించారు. సోమవారం ఏపీఎం సుబ్బయ్య ఆధ్వర్యంలో స్థానిక పాదుపు భవనంలో మండలంలోని నిరక్షరాస్యులకు, పొదుపు మహిళలకు చదువు చెప్పే వలంటరీ టీచర్లకు మహిళా అక్షరాస్యతపై అవగాహన కల్పించి మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని అక్షర జ్ఞానం పెంచుకోవాలని ఎంపీడీఓ సూచించారు. అనంతరం ఏపీఓ ప్రతాప్ మహిళా అక్షరాస్యతపై వలంటరీలకు అవగాహన కల్పించారు. వెలుగు సీసీలు, ఎంఎంఎస్ లీడర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వెలుగు ఏపీఎం రామేశ్వర్ సూచించారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంఎంఎస్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 160 మంది వలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర సాక్షరతా మిషన్ అథారిటీ – వయోజన విద్యాశాఖ అధ్వర్యంలో మండలంలోని నిరక్ష్యరాసులకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు. సోమవారం వలంటీర్ టీచర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభంకాగా, మంగళవారం సైతం వలంటీర్ టీచర్లకు శిక్షణ ఉంటుందన్నారు. సీసీలు శ్రీనివాసులు, గుండమయ్య, మాదులు, మహబూబ్‌బాషా, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు, పాదుపు మహిళలు, వీఏఓలు ఉన్నారు.

వయోజన విద్యపై శిక్షణ

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాల పొదుపు మహిళలకు, సిబ్బందికి వయోజన విద్యపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పాదుపు భవనంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు వయోజన విద్య శాఖధికారి శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో నిరక్ష్యరాసులైన పాదుపు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనేది కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. ప్రతి రోజు సాయంత్రం రెండు గంటల పాటు అక్షరాలు నేర్చుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. వివిధ గ్రామాల వలంటరీ టీచర్స్, సీసీలు, మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలపై అప్రమత్తంగా ఉండాలి



సి.బెళగల్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సి.బెళగల్: చర్మంపై స్పర్శలేని మచ్చల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ స్వస్థ్య సమన్వయకర్త డాక్టర్ శైలేష్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం సి.బెళగల్ పీహెచ్‌సీని సందర్శించి పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అసంక్రమిత వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలేష్‌కుమార్ మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కుష్టు వ్యాధి బాధితుల గుర్తింపులో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది ప్రజలను భౌతికంగా పరీక్షించి, కుష్టు లక్షణాలున్న వారికి పీహెచ్‌సీలో డాక్టర్లచే పరీక్షలు చేయించి మందులను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన స్థానిక డాక్టర్, వైద్య సిబ్బందితో కలిసి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు చేపట్టిన కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేలో పాల్గొని ప్రజలకు స్పర్శలేని మచ్చలు, చెవులపై కణితులు, కాళ్లలో పుండ్లు, రాగిరంగు మచ్చలు, చర్మంపై బుడిపెలు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే 6 నుంచి 12 నెలల్లో చికిత్స తీసుకుంటే నయం అవుతుందని ప్రజలకు తెలియజేశారు. ప్రాజెక్టనిస్ట్ ఖలీల్, సీహెచ్ఓ ఉమామహేశ్వరి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నాడు వెక్కిరించి.. నేడు మళ్లీ రీసర్వే



ఈ.తాండ్రపాడు గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది



పర్ల గ్రామంలో రీసర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు



సి.బెళగల్‌లో రీసర్వే ప్రారంభోత్సవ పూజ చేస్తున్న అధికారులు

కర్నూలు(రూరల్): భూ వివాదాల పరిష్కారమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూముల సమగ్ర సర్వేపై గతంలో కూటమి పార్టీల నాయకులు లెక్కలేనన్ని తప్పుడు ఆరోపణలు చేశారు. అనుకూల మీడియాను అడ్డం పెట్టుకుని దుష్ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే రీసర్వేను నిలిపివేస్తామని ప్రకటించారు. అయితే ప్రస్తుతం మరో గత్యంతరం లేక ఈ నెల 20వ తేదీ నుంచి భూముల రీసర్వేను మళ్లీ ప్రారంభించారు. గతంలో ఎక్కడివరకు సర్వే సాగిందో అక్కడి నుంచే తిరిగి మొదలుపెట్టడం విశేషం. దీంతో కేవలం రాజకీయ లబ్ధి కోసమే కూటమి నాయకులు సర్వేపై తప్పుడు ప్రచారం చేసినట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇదిలాఉండగా కర్నూలు మండల పరిధిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 11 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే నిర్వహించగా కూటమి ప్రభుత్వం ఏపీ రీసర్వే ప్రాజెక్టు పేరుతో 10 రెవెన్యూ గ్రామాలలో రీసర్వే నిర్వహించనుంది. మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో సోమవారం అధికారులు రీసర్వేను ప్రారంభించారు.

కల్లూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల క్షేమం కోరి ప్రవేశపెట్టిన రీసర్వేపై కూటమి పార్టీల నేతలు దుష్ప్రచారం చేశారు. అయితే తిరిగి సోమవారం మండలంలోని పర్ల గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద తహసీల్దార్ ఆంజనేయులు భూముల రీసర్వేను ప్రారంభించారు. ముందుగా పూజా కార్యక్రమం నిర్వహించి రీసర్వే ఉపయోగాలను రైతులకు వివరించారు. సర్పంచ్ హనుమక్క, ఎంపీటీసీ శేషన్న, రీ సర్వే డీటీ జయశ్రీ, మండల సర్వేయర్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో రీసర్వే పనులను రోవర్ పరికరం ద్వారా ప్రారంభించినట్లు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ సోమవారం తెలిపారు. రీసర్వే చేపట్టేందుకు కొర్రపోలూరు గ్రామాన్ని ఎంపిక చేశారని, రైతులకు ఇబ్బంది లేకుండా సర్వే చేస్తామని చెప్పారు. మండల సర్వేయర్ మధు, వీఆర్వో అనిల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ మాలిక్ బాషా, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు ప్రారంభం

సి.బెళగల్: మండల కేంద్రంలో భూముల రీసర్వే పనులను రెవెన్యూ, సర్వే అధికారులు సోమవారం ప్రారంభించారు. మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల సర్వేయర్ నాగభూషణం వీఆర్వోలు, సర్వే సహాయకులతో గ్రామంలోని ఇనగండ్ల రోడ్డులోని గ్రామ సరిహద్దు రాయి వద్ద పూజలు నిర్వహించిన అధికారులు రీ సర్వే పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామం మొత్తం విస్తీర్ణం 10,059.22 ఎకరాలు ఉండగా, ప్రభుత్వ భూమి 2,553.30 ఎకరాలుగా ఉందని అధికారుల తెలియజేశారు. సిబ్బంది ఏడు బృందాలుగా ఏర్పడి సి.బెళగల్ రెవెన్యూ గ్రామాలకు చెందిన సి.బెళగల్, చింతమానుపల్లె గ్రామాలకు చెందిన 855 సర్వే నంబర్లుగా ఉన్న భూములను రీసర్వే చేస్తారని అధికారులు వెల్లడించారు.

పాణ్యం: మండల పరిధిలోని గగ్గటూరు గ్రామంలో సోమవారం భూముల రీసర్వేను అధికారులు ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి రోవర్ మిషన్ సాయంతో సర్వేను ప్రారంభించారు. గడువులోపు సర్వేను పూర్తి చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి వెల్లడించారు. మండల సర్వేయర్ నాగరాజు, వీఆర్ఓ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల వద్ద కేజీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మండలంలోని వెంకాయపల్లె గ్రామంలోని పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో డ్రైనేజీ పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. కర్నూలు – గుంటూరు ప్రధాన రహదారిపైనే మురుగు పారుతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించేవారు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి సమీపాన మసీదు, ఇంజినీరింగ్ కాలేజీ, దుకాణాలు, బస్టాప్ ఉన్నందున అందరికీ ఇబ్బందులు తప్పడం లేదు. మురుగు నీరు రోడ్డుపై పారుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వదంతులు నమ్మొద్దు

కర్నూలు న్యూసిటీ: మైనింగ్ శాఖలో ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదని ఆ శాఖ జిల్లా ఉప సంచాలకులు రవిచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్యాండ్ రీచ్‌లలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు వాట్సాప్ గ్రూప్‌లలో నిరాధారమైన వార్తలు వస్తున్నాయని వాటిని నమ్మవద్దని సూచించారు. నిరుద్యోగ యువత ఇలాంటి వదంతులు నమ్మి మోసపోవద్దని, వదంతులు సృష్టించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మాతా శిశు మరణాలను తగ్గించాలి



కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: మాతా శిశు మరణాల రేటును తగ్గించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఉమ సూచించారు. సోమవారం కోడుమూరులోని 2వ హెల్త్ సెంటర్‌ను ఆమె సందర్శించి బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయుష్మాన్, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కిశోర బాలికలకు పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్నవారికి మందులు అందించాలన్నారు. అలాగే కుష్టు వ్యాధి నిర్ధారణకు నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అనుమానిత కేసులున్నట్లెతై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చికిత్స అందేలా చూడాలన్నారు. అనంతరం ఆమె వైద్య సిబ్బందితో కలిసి కుష్టు వ్యాధి నిర్ధారణ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. వైద్యాధికారులు శ్రీమంత్‌మాదన్న, మదన్‌శేఖర్, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాబాయి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు



సి.బెళగల్ పీజీఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు రెండు అర్జీలు వచ్చాయి. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. బ్రాహ్మణదొడ్డి, పోలకల్ గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ తహసీల్దార్ అర్జీలను ఇచ్చారు. మండల విద్యుత్ ఏఈ సుకుమార్, ఎంపీఈఓ వెంకటేష్, వీఆర్వోలు పాల్గొన్నారు. అయితే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సుమంత్, గోనేనాయక్, ఎంఈఓ జ్యోతి, మండల ఉపాధిహామీ ఏపీఓ రామన్న, వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరమ్మ తదితరులు విడిగా హాజరయ్యారు.

భారతి ఆచూకీ కనిపెట్టడంలో పోలీసుల విఫలం

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం నాయకల్లుకు చెందిన భారతి ఆచూకీ కనిపెట్టడంలో పోలీసులు విఫలమయ్యారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి విమర్శించారు.సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జనవరి 1న భర్త రవికుమార్‌తో గొడవపడిన భారతి అదేరోజు హంద్రీ-నీవా కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారని, అయితే ఇంతవరకు ఆమె ఆచూకీ గానీ, మృతదేహం గానీ దొరకలేదన్నారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కై లాష్ నాయక్, కులాల ఐక్య వేదిక కన్వీనర్ టి.శేషఫణి తదితరులు పాల్గొన్నారు.